A1TV NEWS

APTEL 2023/16425

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 101 ఆదివారం అక్టోబర్ 22 - 2023 పేజీలు 4. వేల :4 /



విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక




# పోలీసులకు ప్రభుత్వం

## అన్ని రకాలుగా తోడుగా ఉంటుంది.


**-ఖాకీ డ్రెస్ అంటే త్యాగనిరతి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం జగన్.**

**-విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన పోలీస్ సోదరులకు ప్రభుత్వం అన్నివిధాలుగా తోడుగా ఉంటుంది.**

ఆంధ్ర ప్రగతి విజయవాడ అక్టోబర్ 21:
సమాజం కోసం తన ప్రాణాన్ని బలిపెట్టడానికి సిద్ధపడిన ?యోధుడు పోలీస్ అని సీఎం జగన్ కొనియాడారు. ఖాకీ డ్రెస్ అంటే త్యాగనీరతి అని, పోలీస్ ఉద్యోగం అనేది ఓ సవాల్.. బాధ్యత అని అలాంటి పోలీస్ కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని సీఎం జగన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం పాల్గొని.. విధి నిర్వహణలో అమరులైన పోలీస్ సిబ్బందికి నివాళులర్పించారు. ఈ రోజు విధినిర్వహణలో అమరులైన పోలీసు త్యాగాలను స్మరించుకునే రోజు అని, దేశ ప్రజలంతా కూడా మన పోలీసులను మనసులో సెల్యూట్ చేసే కమామ్‌రేషన్ డే సందర్భంగా మనం ఇక్కడ సమావేశమైయ్యామని పోలీసులనుద్దేశించి సీఎం ప్రసంగించారు. ప్రతి సంవత్సరం అక్టోబరు 21 వ తారీఖున పోలీసుల అమరవీరుల సంస్మరణదినోత్సవం దేశమంతా జరుపుకుంటుందని చెప్పారు.

1959 అక్టోబరు 21 న చైనా సైనికులను ఎదురించి పోరాడిన ఎస్సై కరణ్‌సింగ్ ఆయన సహచరుల ధైర్యాన్ని, త్యాగాన్ని ఆమరవీరుల సంస్మరణ దినోత్సవంగా మన దేశం గత 64 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం గుర్తు చేసుకుంటూ ఉంటాం అని అన్నారు. గడిచిన సంవత్సర కాలంలో ఇలా దేశ వ్యాప్తంగా అమరులైన 188 పోలీసులు అందరికీ శ్రద్ధాంజలి ఘటించారు.

మిగతాది 2లో...



# గగన్ యాన్ ... మిషన్ టెస్ట్ లాంచ్ విజయవంతం.

ఆంధ్ర ప్రగతి శ్రీహరికోట అక్టోబర్ 21: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా తలపెట్టిన టెస్ట్ వెహికిల్ అబార్ట్ మిషన్ (టీవీ–డీ1) ప్రయోగం విజయవంతం అయింది. ఆంధ్రప్రదేశ్ శ్రీహరికోటలోని షార్ నుంచి ఈ రోజు ఉదయం 10 గంటలకు సింగిల్ స్టేజ్ లిక్విడ్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోట నుంచి %ఒ–ఐఒ%1 రాకెట్ ప్రయోగం విజయవంతంగా జరిగింది. సింగిల్ స్టేజ్ లిక్విడ్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత.. పారాచూట్ సాయంతో క్రూ మాడ్యూల్ బంగాళాఖాతంలో పడిపోయింది. మిగతాది 4లో...

# ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం దసరా కానుక

ప్రభుత్వ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా శుభవార్తను అందించింది. డీఏను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగుల సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటన మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏను 3.64 శాతం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ డీఏను 2022 జులై 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నారు. నిన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని ఉద్యోగుల సంఘం నేతలు కలిసి డీఏ విడుదల చేయాలని కోరగా, సానుకూలంగా స్పందించారు. అగస్ట్ 2న విజయవాడలో జరిగిన ఏపీఎన్జీవో రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో సీఎం జగన్ డీఏ ఇస్తామని ప్రకటించారు. దసరాకు రెండు రోజుల ముందు ఇప్పుడు డీఏ విడుదల చేయడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# చంద్రబాబుకు ఇంకెన్నాళ్లీ జైలు..!

ఆంధ్ర ప్రగతి అమరావతి అక్టోబర్ 21:
టిడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బయటకు రావాలని ఆ పార్టీ నేతలంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. స్కిల్ స్కామ్ లో అరెస్ట్ అయిన ఆయన 45 రోజులుగా రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్నారు. ఆయన బెయిల్ కోసం ఎన్ని ప్రయత్నాలు జరుగుతున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు. దీంతో ఆయన ఎప్పుడు బయటకు వస్తారో అనే సందిగ్ధత అందరిలోనూ నెలకొంది. స్కిల్ స్కామ్, ఫైబర్ గ్రేడ్ స్కామ్, అమరావతి రింగ్ రోడ్ స్కామ్, అంగళ్ళు.. ఇలా లెక్కకు మించి కేసులు ఆయన చుట్టూ ఉన్న సంగతి తెలిసిందే. ఈ కేసుల విషయంలో కోర్టులు కూడా ఎప్పటికప్పుడు చంద్రబాబుకు షాక్ ఇస్తూనే ఉన్నాయి. స్కిల్ స్కామ్ విషయంలో రిమాండ్ పొదిగిస్తూ ఏసీబీ కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో నవంబర్ 1 వరకు చంద్రబాబు జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి. ఆరోజైన చంద్రబాబుకు అనుకూలంగా తీర్పు వస్తుందా అంటే చప్పలేని పరిస్థితి.

4




# రాహుల్ గాంధీపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు

**కేసీఆర్ దీక్ష చేస్తేనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రకటించిందన్న కవిత**

**గాంధీ కుటుంబానికి, తెలంగాణకు మధ్య విద్రోహ సంబంధం ఉందని విమర్శ**

**రాహుల్ గాంధీ బబ్బర్ షేర్ కాదని, పేపర్ పులి మాత్రమేనని ఎద్దేవా**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిప్పులు చెరిగారు. ఆమె జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో మీడియాతో మాట్లాడుతూ... మన ముఖ్యమంత్రి కేసీఆర్ నాడు దీక్ష చేస్తేనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ప్రకటించిందన్నారు. ఉద్యమాలు, అమరవీరుల కారణంగా రాష్ట్రం సిద్ధించిందన్నారు. గాంధీ కుటుంబానికి, తెలంగాణకు మధ్య విద్రోహ సంబంధం ఉందని విమర్శించారు. రాహుల్ గాంధీ బబ్బర్ షేర్ కాదని, పేపర్ పులి మాత్రమే అన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వయసు మరిచి దిగజారి మాట్లాడుతున్నారన్నారు. సింగరేణి కార్మికులకు బీఆర్ఎస్ హయాంలోనే న్యాయం జరిగిందన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో బీడీ కార్మికులకు ఉపయోగపడే విధంగా ఉందన్నారు. ఉపాధి కోసం వెళ్లి గల్ఫ్‌లో చనిపోయిన వారికీ ప్రభుత్వ బీమా వర్తిస్తుందన్నారు. గల్ఫ్‌లో ఉన్న వారి పేర్లు రేషన్ కార్డుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో తొలగించమని హామీ ఇచ్చారు.



# చంద్రబాబు పోరాటస్ఫూర్తితో ముందుకు సాగుదాం..

**-ఒక ఛాన్స్ పేరుతో జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. -చివరికి నా తల్లిపై కూడా కేసులు పెడతామని భయపెడుతున్నారు.**

**-ప్రజల కోసమే చంద్రబాబు పోరాటం మంతా. -టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్.**

ఆంధ్ర ప్రగతి మంగళగిరి అక్టోబర్ 21:
ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం అహర్నిశలు కష్టపడిన ప్రజా నాయకుడు తెదేపా అధినేత చంద్రబాబు అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కంటతడి పెట్టారు..
పోలవరం ప్రాజెక్టు 72 శాతం పనులు పూర్తి చేసిన చంద్రబాబును అక్రమంగా బంధించారని ఆరోపించారు. మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో లోకేశ్ అధ్యక్షతన తెదేపా పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లోకేశ్ భావోద్వేగంగా ప్రసంగించారు. "2019లో ఒక్క ఛాన్స్ అంటే జగన్‌ను గెలిపించారు. నియంత మాదిరిగా జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల్లోకి తోసేశారు. సైకో జగన్ మొదటి నిర్ణయం.. ప్రజల కోసం కట్టిన ప్రజావేదిక కూల్చడం. దళితులు, బీసీలు, మైనారిటీలు, అనేకమంది తెదేపా నాయకులపై వేల కేసులు పెట్టించారు. రాష్ట్రానికి చంద్రబాబు అనేక పరిశ్రమలు తీసుకొచ్చారు. వేలమంది నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పించారు. పరిశ్రమలు తీసుకొచ్చి, ఉద్యోగాలు కల్పించినందుకు చంద్రబాబును జైలుకు పంపించారా? అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినందుకు చంద్రబాబును బంధించారా? జాబ్ క్యాలెండర్



వెంటనే విడుదల చేయడం ఆయన చేసిన నేరమా? సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారని ప్రశ్నించడం చంద్రబాబు తప్పా? ఇతర రాష్ట్రాల రాజధానులకు దీటుగా మన రాజధాని ఉండాలని అహర్నిశలు కష్టపడినందుకు చంద్రబాబును బంధించారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరడం తప్పా? ఇసుక దోపిడీ, కల్తీ మద్యంపై మాట్లాడడం.. కరెంటు, ఆర్టీసీ ఛార్జీలు, పన్నులు తగ్గించాలని అడగడమే ఆయన చేసిన నేరమా? కుటుంబం గురించి ఒక్క క్షణం కూడా పట్టించుకోకుండా అహర్నిశలు ప్రజల గురించే చంద్రబాబు ఆలోచించారు. పేదవాళ్లు శాశ్వతంగా పేదరికం నుంచి బయటకు రావాలని కష్టపడ్డారు. ఏనాడైనా మా అమ్మ



బయటకొచ్చారా? చివరకు మా తల్లిపైనా కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. ఏనాడు ప్రభుత్వ కార్యక్రమాలకు మా అమ్మ రాలేదు. అసెంబ్లీ సాక్షిగా ఈ సైకో జగన్, ఆయన సైన్యం ఆమెను అవమానించారు. సేవా కార్యక్రమాలు తప్ప రాజకీయాలు నా తల్లికి తెలియదు. గవర్నర్‌ను కలిసేందుకు కూడా వెళ్లలేదు. చంద్రబాబుకు పంపించే భోజనంలో విషం కలుపుతారని మాపై ఆరోపణలు చేస్తున్నారు. భోజనాల్లో విషం కలపడం, కోడికత్తి డ్రామాలు మా డీఎన్ఏలోనే లేవు. చంద్రబాబు ఇచ్చిన పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదాం" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

# ఇది హిందువుల సమిష్టి విజయం: విశ్వ హిందూ పరిషత్



ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 21:
తిరుమల తిరుపతి దేవస్థానానికి భక్తులు సమర్పించుకునే కానుకలు, హుండీ లాంటి సొమ్ము నుండి టీటీడీ పాలకమండలి వారు ప్రభుత్వ అవసరాలకు వాడుకోవడం పై విశ్వ హిందూ పరిషత్ మరియు ఇతర సంఘ పరివార క్షేత్రాలన్నీ నిరసన గళమెత్తాయి. ఈ సందర్భంగా శనివారం నిరసన ప్రదర్శన మరియు వినతిపత్రం అందజేసే కార్యక్రమం ఉండగా రాత్రికి రాత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టిటిడి పాలకమండలిని మందలిస్తూ 1% నిధులను తిరుపతి కార్పొరేషన్ కు కేటాయించడాన్ని విరమించుకోవాలని చెప్పి ఉత్తర్వులు జారీ చేయడాన్ని విశ్వ హిందూ పరిషత్ స్వాగతిస్తుందని బజరంగ్దళ్ రాష్ట్ర కో కన్వీనర్ పోలేపల్లి సందీప్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ హిందూ దేవాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రక్రియలో భాగంగానే టీటీడీ పాలక మండలి వారు ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని గతంలో కూడా ఇటువంటి నిర్ణయాలు తీసుకున్నప్పుడు హిందూ సమాజం పెద్ద ఎత్తులో గళమెత్తి అటువంటి నిర్ణయాలను వెనక్కి తీసుకునేలా చేసిందని గుర్తు చేశారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడా మురళీధర్ మాట్లాడుతూ టీటీడీ పాలకమండలిలో రాజకీయ నేపథ్యం కాకుండా ధార్మిక చింతన కలిగిన వారిని నియమించాలని, అప్పుడే ఇటువంటి తప్పుడు నిర్ణయాలు వాళ్ళ మనసులోకి రావని తెలియజేశారు. తిరుమల దర్శనానికి వచ్చే భక్తుల ద్వారా అనేక రకాల టాక్స్ ల రూపంలో తిరుపతి నగరపాలక సంస్థకు అత్యధిక టాక్స్ వసూలు అవుతుందని , ఇప్పుడు 1% పేరుతో వార్షిక బడ్జెట్ నుండి నిధులు తీసుకోవడం మొదలుపెడితే ఇది భవిష్యత్తులో పెంచుకుంటూ పోయే అవకాశం ఉందని హిందూ దేవాలయాల సొమ్ము అన్య అవసరాలకు వాడకూడదని ఇటువంటి తప్పుడు నిర్ణయం తీసుకున్నటువంటి టీటీడీ పాలకమండలి వారు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి గారు హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శేష సాయి, నగర అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, లింగేశ్వర బాబు, భాజపా నాయకులు బివి సుబ్బారెడ్డి, భగవాన్ యాదవ్, జిల్లా సంఘ చాలక్ చిలుకూరు శ్రీనివాస్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు ఏదైనా జరిగితే జగన్‌దే బాధ్యత. -మోత్కుపల్లి.

ఆంధ్ర ప్రగతి హైదరాబాద్ అక్టోబర్ 21:



రాజమహేంద్రవరం జైల్లో ఉన్న తెదేపా అధినేత చంద్రబాబుకు ఏదైనా జరిగితే సీఎం జగన్‌దే బాధ్యతని మాజీ మంత్రి, సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు..పురుగు మందు డబ్బా తీసుకొని ఎన్టీఆర్ ఘాట్ వద్దకు ఆయన ఇవాళ వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మోత్కుపల్లి మాట్లాడారు. "చంద్రబాబు ఆరోగ్యాన్ని దెబ్బతీసి చంపాలని చూస్తున్నారు. ఆయన హింసించి బాధపెడుతున్నారు. జగన్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. రాజధాని లేని రాష్ట్రాన్ని పాలిస్తున్న ఏకైక సీఎం జగన్. చంద్రబాబు కుటుంబానికి భద్రత లేదు. ఏపీలో పేద ప్రజలు బతికే పరిస్థితి లేకుండా చేశారు. చంద్రబాబును బయటకు రాకుండా చేసి ఓట్లను సాధించాలని ప్రయత్నమా? ఎన్నికల్లో డబ్బులు ఇచ్చి జగన్ మళ్లీ గెలవాలని చూస్తున్నారు" అని మోత్కుపల్లి మండిపడ్డారు.

# విద్య, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి.

## - ఏపీటీఎఫ్.




ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 21:
జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అపరిష్కృతంగా ఉన్న విద్య ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. మాధవ స్వామి, కె. సాంబశివుడు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి ని వినతి పత్రం ద్వారా కోరారు. వివిధ సమస్యలు డిఈఓ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. 1. పెండింగ్ లో ఉన్న మెడికల్ బిల్లులను మంజూరు చేయాలి. 2. బదిలీలు పొంది రిలీవర్ లేక ఆగిపోయిన ఎస్ జి టీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి. 3. ఉర్దూ బోధించుటకు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ స్థానాల్లో డిప్యూటేషన్ వేయాలి. 4. ఉర్దూ మరి స్పెషల్ తెలుగు పాఠ్యపుస్తకాలను సరఫరా చేయాలి. 5. ఫెయిల్ అయిన విద్యార్థుల పరీక్ష ఫీజు కట్టమని ప్రధానోపాధ్యాయులను ఒత్తిడి చేయరాదు. 6. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గడివేముల మెయిన్ పాఠశాలలో స్ట్రెంత్ లేకపోతే రూల్ ప్రకారం డిప్యూటేషన్ వేయాలని కోరారు. తదితర పాఠశాలలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కార్యదర్శి స్వామినాథం సబ్ కమిటీ సభ్యులు వెంకటరాముడు,పుల్లయ్య, మునిస్వామి, రవికుమార్, గోపాలరావు, చంద్రశేఖర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయండి.

### -రెవెన్యూ అంశాలలో నిర్ధేశించిన లక్ష్యాన్ని చేధించండి .

### -రెవెన్యూ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 21:
జిల్లాలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ అన్ని మండలాల తాసిల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రీ సర్వే, స్పందన గ్రీవెన్స్, ఆర్ఓఆర్ కేసులు, ఏపీ సేవా సర్వీసులు, మ్యుటేషన్ సేవలు, భూ సేకరణ %ఌ% పరాయీకరణ, వ్యవసాయ భూముల కేటాయింపు, ఇనామ్ సర్వీస్ భూములు, పౌరసరఫరాలు, కోర్టు కేసులు తదితర నిర్దేశిత రెవెన్యూ లక్ష్యాల సాధనపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన రి సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల తాసిల్దార్లను ఆదేశించారు. భూ వివాదాల డిస్ప్యూట్స్ కు సంబంధించి స్పందన కార్యక్రమంలో అనేక దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో సంబంధిత తాసిల్దారులు, వీఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆర్ఓఆర్ పెండింగ్ కేసులు, క్షేత్రస్థాయిలో అనుభవంలో ఉన్న కేసులను విశ్లేషించి మండలాల వారీగా వారం రోజుల్లో నివేదికలు ఇవ్వాలని మండల తాసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు నిర్దేశించిన రీ సర్వే కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో నిశితంగా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. సర్వే బృందాలు గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, స్టోన్ ప్లాంటేషన్ తదితర ప్రక్రియలను ఆర్డీవోలు పరిశీలించాలన్నారు.
జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళ్తున్నాయని పలుమార్లు సూచించినప్పటికీ సంబంధిత తాసిల్దారులు, వీఆర్వోలు అశ్రద్ధ చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్లో ఉన్న గ్రామాల అవార్డ్స్ ను పాస్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత మండల తాసిల్దార్ లను ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు




సంబంధించి నిత్యావసర సరుకుల పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన రెవిన్యూ అంశాలను కాల పరిమితి లోపు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేయాలని అన్ని మండలాల తాసిల్దారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో లో డిఆర్ఓ పుల్లయ్య, సంబంధిత డివిజన్, మండలాల ఆర్డీవోలు, తాసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్ లు, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# యావత్ ప్రపంచం నిద్రించినా మేల్కొని కాపాడేది.. పోలీస్ వ్యవస్థ ఒక్కటే.

### -పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్. -పరిపాలన వ్యవస్థలో నంద్యాల జిల్లాది అత్యుత్తమ స్థానం.

### -పోలీసులు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 21:
యావత్ ప్రపంచం నిద్రపోయినా ప్రజలను కాపాడుకోవడానికి మేల్కొనే ఉండి రక్షించే వ్యవస్థ పోలీస్ వ్యవస్థ ఒక్కటేనని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. శనివారం నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హాబీబుల్లా, జల వనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకోవాలన్నారు. సమాజమే కుటుంబంగా భావించి సొంత కుటుంబాలను కూడా పక్కనపెట్టి నిర్విరామంగా పని చేసే వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ పరిపాలనలో కీలక భాగమైన సామాన్యుల ధన, మాన, ప్రాణ రక్షణలో పోలీసులదే ముఖ్య భూమిక అన్నారు. విధులు నిర్వర్తించే పోలీసులతో సమానంగా వారి కుటుంబాన్ని నడిపించే సభ్యుల భాగస్వామ్యం కూడా వెలకట్టలేనిదన్నారు. శాంతిభద్రతలకు సంబంధించిన అంశంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్ర భాగంలో ఉందన్న విషయం తాను సదరన్ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొనడం వల్ల మరింత అర్థమైందన్నారు. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం తీవ్రవాదం, అసాంఘిక శక్తుల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడే తరుణంలో విధులు నిర్వర్తిస్తూ 188 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారన్నారు. జిల్లాకు చెందిన కానిస్టేబుల్ నరేంద్రనాథ్, హోంగార్డు రాజశేఖర్ లు రౌడీ మూకలను నిలువరించే ప్రయత్నంలో చనిపోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందించవలసిన సహాయ కార్యక్రమాలలో తన పూర్తి స్థాయి తోడ్పాటు ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లాలో పోలీసులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి విద్య, వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. తన చిన్నతనంలో తన తండ్రి ఆర్మీకి పంపాలనుకుని తమపై ప్రేమ వల్ల పంపలేక పోయిన విషయం తరచూ చెప్పేవారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. దేశ సేవలో ఒకటైన రాజకీయ రంగం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన అవకాశం వల్ల ప్రజా సేవ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా అంటే ఫ్యాక్షన్ ప్రాంతమనే ముద్ర తొలగించుకుని అత్యున్నత పరిపాలన వ్యవస్థ ఉన్న జిల్లాగా అవతరించామని..అందుకు కృషి చేస్తోన్న పోలీసుల సేవలను మంత్రి ప్రశంసించారు.
జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తూ ఘనంగా నివాళులర్పిస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా పరిశీలిస్తే ఎక్కడైతే భద్రత ఉంటుందో ఆయా ప్రాంతాలలో అభివృద్ధి వేగం పుంజుకుంటున్నట్లు స్పష్టం అవుతోందన్నారు. శాంతి భద్రతలు సక్రమంగా అమలు పరచడంతో పాటు భద్రత ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆఫ్రికన్ దేశాలలో చూస్తే అభివృద్ధిఅనేది బలహీన దశలో ఉందన్నారు. దేశ సరిహద్దు ప్రాంతాల్లో మిలిటరీ, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ సిబ్బంది తమ కుటుంబాలను త్యాగం చేసి రక్షణ కల్పిస్తున్నారన్నారు. అలాగే దేశ అంతర్గత ప్రాంతాలలో పోలీసులు, పారా మిలిటరీ, స్పెషల్ రిజర్వ్ బృందాలు ప్రజలకు భద్రత కల్పిస్తూ సేవలందిస్తున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, ప్రముఖుల పర్యటనలు, ఉత్సవాలు, జాతరలు ఇతర రెస్క్యూ ఆపరేషన్లలో కూడా పోలీసుల పాత్ర కీలకమైందన్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ అధికారుల బృందాలు వెంటనే స్పందించి చురుకుగా పనిచేసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఖాకీ దుస్తులు వేసుకునే అవకాశం అందరికీ రాదని...పోలీసులు ఖాకీ దుస్తులు ధరించగానే మరింత బాధ్యత పెరిగి క్లోజ్ గా పర్యవేక్షించే ప్రవర్తన కలిగి ఉంటారని కలెక్టర్ తెలిపారు. పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా వుండి ఆదుకుంటామన్నారు.
జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ ఈరోజు ఘనంగా నివాళులర్పిస్తున్నామన్నారు. 1959, అక్టోబరు 21 న 'భారత్ %--% టిబెట్' సరిహద్దుల్లో 10 మంది సీఆర్పీఎఫ్ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా, చైనా సైనికులు భారీ సంఖ్యలో దేశ సరిహద్దులోకి వచ్చి దాడి చేసిన సంఘటనలో అసువులు బాసిన పోలీస్ వీరులను స్మరించుకుంటూ ప్రతి ఏడాది అక్టోబర్ 21న సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. దేశ అంతరంగిక భద్రత కోసం, శాంతి భద్రతలను కాపాడటంలో గత సంవత్సరం ఆగస్టు నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 188 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. మన జిల్లాలో కానిస్టేబుల్, హోంగార్డు మరణాలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు,అందరి సహకారంతో శాంతి భద్రతలను కాపాడగలిగామన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం పరిరక్షణ కోసం స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం ఇటీవల మార్కెట్ యార్డ్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన 14 మంది పండ్ల వ్యాపారస్తులకు నష్టపరిహార చెక్కులను మంత్రి అందజేశారు.



# ఈనెల 31న ప్రజారక్షణభేరి బస్సు యాత్రను జయప్రదం చేయండి :సిపిఎం




ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు అక్టోబర్ 21:
అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం పార్టీ రూపొందించిన ప్రజా ప్రణాళిక అమలు కోసం ప్రజారక్షణభేరితో జరుగు బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం, సీనియర్ నాయకులు ఏ.రాజశేఖర్ లు కోరారు. శనివారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్ నందు సిపిఎం పార్టీ డివిజన్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం పార్టీ మండల కార్యదర్శి నరసింహ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలు సొంత అజెండాల చుట్టూ తిరుగుతున్నాయని అన్నారు వీటిని ప్రజా సమస్యల చుట్టూ మళ్ళించాల ప్రయత్నం చేస్తున్నామని రాష్ట్రంలో కొరవులు తీవ్రంగా ఉందని 339 మండలాలలో కరువు పరిస్థితులు ఉన్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాలకు అదనపు సిబ్బందిని నియమించి కరువు నుంచి కాపాడాలని సూచించారు. ప్రజలకు త్రాగేందుకు మంచినీరు కూడా లేదని విష జ్వరాలు పెరుగుతున్నాయని వైరల్ ఫీవర్లు వస్తే ఎక్కువ రోజులు ఉండటం వచ్చినయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి జ్వరాలకు మూల కారణాలను గుర్తించి దాని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో దసరా పండుగ సందర్భంలో రేషన్ కార్డుదారులకు బియ్యం పప్పు నూనె ఇచ్చేవారని ఏడాది అదేమీ లేదని విమర్శించారు ప్రభుత్వం స్పందించి వాటిని అందించాలని కోరారు. బిజెపి 9 ఏళ్ల పాలనలో దేశంలో రాష్ట్రంలో దాడులు ఎక్కువయ్యాయని ఈ దాడులను కాంగ్రెస్ వైసీపీ టిడిపి జనసేన రాజకీయ పార్టీ ఖండించలేదని వారు అన్నారు. తెలుగుదేశం బిజెపి జనసేన లో తెలుగు రాష్ట్రాలలో కలిసి పోటీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయని వారన్నారు. ప్రజలు కార్మికులు కర్షకులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల పరిష్కారం గురించి వారి అభివృద్ధి కోసం ఎటువంటి విధానాలు కావాలని అంశంపై చర్చించి సిపిఎం ఆధ్వర్యంలో తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉండే ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజాప్రక్షమ బిజెపి పక్షం అనేది తెలుసుకోవాలని వారు సిపిఎం పార్టీగా ఆయా నాయకులను కోరారు ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజారక్షణ భేదితో జరుగుయాత్ర ఈ నెల 31వ తేదీన ఉదయం 11:30 గంటలకు పాత బస్టాండ్ కు రాబోతుంది ఆత్మకూరు పట్టణానికి రాబోతుంది. కావున పట్టణ ప్రజలు మేధావులు లౌకికవాదులు ప్రజాతంత్ర వాదులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ బస్సు యాత్రను జయప్రదం చేయాలని వారు సిపిఎం పార్టీగా కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శిఏ. రణధీర్,పాములపాడు మండల కార్యదర్శి సామన్నా, నాయకులు టి వెంకటేశ్వరరావు,
శంకర్ రెడ్డి,సంజీవ రాయుడు, మా భాష,సుధాకర్, వీరన్న,సురేంద్ర,స్వాములు,తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరులో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కాటసాని.



ఆంధ్ర ప్రగతి పాణ్యం అక్టోబర్ 21:
పాణ్యం మండలం ఎస్.కొత్తూరు నందు గల ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బరాయుడు స్వామి దేవస్థానం నందు 2,07,00,000 (రెండు కోట్ల ఏడులక్షల) రూపాయల దేవస్థానం నిధులతో దేవాలయం నందు భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లు మరియు షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి. కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం రూ 2 కోట్ల 7 లక్షలతో ప్రత్యేక క్యూ లైన్ భక్తులకు విడిది గదుల లకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ... మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీరం రాజేశ్వరి, ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామకృష్ణ, ఇంజనీరింగ్ సిబ్బంది శివరామిరెడ్డి దేవాలయం ప్రధాన అర్చకులు నారాయణస్వామి, సురేష్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం.

## -సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.



ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 21:
అక్టోబర్ 15 నుంచి 21 వరకు పోలిస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా డోన్ పట్టణంలో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో అక్టోబర్ 15 నుంచి 21 వరకు పోలిస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పోలిస్ అమరవీరులకు జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.

# పోలీసులకు ప్రభుత్వం అన్ని రకాలుగా తోడుగా ఉంటుంది.

ఈ ఏడాది మన రాష్ట్రంలో విధినిర్వహణలో ప్రాణం ఒదిలిన పోలీసు సోదరుల కుటుంబాలకు మనందరి ప్రభుత్వం అన్నిరకాలుగా అండగా, తోడుగా ఉంటుందని సీఎం పునరుద్ఘాటించారు. సమాజం కోసం తన ప్రాణాన్ని బలిపెట్టడానికి సిద్ధపడిన యోధుడు పోలీసు అని, ఖాకీ డ్రెస్ అంటే త్యాగ నిరతి అని, ఆ డ్రెస్ మీద ఉన్న మూడు సింహాలు మన దేశ సార్వభౌమాధికారానికి చిహ్నం అని అన్నారు. పోలీస్ అంటే అధికారం మాత్రమే కాదని, అంతకుమించి పోలీస్ అంటే ఒక బాధ్యత కూడా అని ఈ ఉద్యోగం ఒక సవాల్ అని మరీ ముఖ్యంగా నేరం వేగంగా తన రూపాన్ని మార్చుకుంటున్న ఈ యుగంలో అంతకుమించిన వేగాన్ని అందుకుంటేనే పోలీసింగ్‌కు విలువ ఉంటుందని సీఎం పేర్కొన్నారు.



ఈ రోజు కొత్త టెక్నాలజీ వల్ల సమాజంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా సైబర్ సెక్యూరిటీ నుంచి డేటా థెఫ్ట్ వరకు, డేటా థెఫ్ట్ నుంచి సైబర్ హెరాస్‌మెంట్ వరకు ప్రతి అంశంలోనూ నేరాలన్నీ నిరోధించడానికి, వాటి మీద దర్యాప్తు చేసి శిక్షవేయడానికి పోలీసులు ఎంతగానో అప్‌డేట్ కావాల్సిన యుగంలో మనమంతా ఉన్నామని, స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ వాడకం వల్ల సైబర్ ప్రపంచంలో మరో చీకటి ప్రపంచం సృష్టించుకుని నేరాలు చేస్తున్నవాళ్లను ఎదుర్కొవాల్సిన ఒక బృహత్తర బాధ్యత కూడా ఇవాళ పోలీసుల భుజస్కంధాల మీద మరింతగా వచ్చిపడిందని సీఎం పేర్కొన్నారు. రకరకాల నేరాలతో పాటు కొత్త టెక్నాలజీని అనూహ్యంగా వాడుకుని విజృంభించే అసాంఘిక శక్తులు విసిరే సవాళ్లకు ఎప్పటికప్పుడు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు.
హోంగార్డులు, కానిస్టేబుళ్ల నుంచి ఎస్పీలు, డీజీపీ వరకు ప్రతి ఒక్కరూ మారుతున్న ఈ సమాజం విసురుతూ ఉన్న కొత్త సవాళ్లకు సమాధానం చెప్పడానికి మనందరి సిద్ధం కావాలని సూచించారు. నేర నిరోధం, నేర దర్యాప్తు ఈ రెండింటిలోనూ మన పోలీసులు అత్యాధునిక సైబర్ టెక్నాలజీ ఉపయోగిస్తూ దేశంలోనే అగ్రగామిగా ఉన్నారన్న వాస్తవం, ఈ డివిజన్‌లో 130 మంది సాంకేతిక పోలీసింగ్ నిపుణులను మన ప్రజల కోసం పనిచేస్తున్న వాస్తవం ప్రజలకు ఎంతో ధైర్యానిస్తుందని చెప్పారు.
ఇదే సమయంలో అసాంఘిక శక్తులనే పదాన్ని మనం రీడిఫైన్ చేయాల్సిన అవసరం ఇటీవల జరిగిన అనేక సంఘటనలు చూసినప్పుడు మనందరికి కూడా ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తుందని సీఎం జగన్ అన్నారు. ప్రశాంతంగా సాగిపోతున్న ప్రజాజీవనాన్ని తమ స్వార్ధం కోసం దెబ్బతీస్తున్న శక్తులన్నీ కూడా అసాంఘిక శక్తులేనని, ప్రభుత్వం మీద, సమాజం మీద దాడి చేసి మనుగడ సాగించాలనుకునే ఇలాంటి శక్తులన్నీ కూడా అడవుల్లోనో, అజ్ఞాతంలో కాకుండా ప్రజా జీవితంలో ఉంటూ అదే ప్రజాజీవితం మీద దాడిచేయడాన్ని కూడా మనమంతా ఈ మధ్యకాలంలో మరింత ఎక్కువైన పరిస్థితులను చూస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, పత్రికాస్వేచ్ఛ లాంటి పదాలకు అర్ధం అంటే ఒక ముఠా, ఒక వర్గం చట్టాన్ని పోలీసుల నుంచి న్యాయస్ధానాల నుంచి లాగేసుకోవటం కాదని గుర్తు చేశారు. మొన్న నూజివీడులో విధి నిర్వహణలో ఉన్న ఒక పోలీసు కానిస్టేబుల్‌ను చంపారుని మన కళ్లెదుటనే జరిగిన సంఘటనలు ఇవన్నీ అని సీఎం ఉదాహరణలు చెప్పారు.
"అంగళ్లలో సాక్షాత్తూ ప్రతిపక్ష నాయకుడు తన పార్టీవాళ్లను రెచ్చగొట్టి పోలీసుల మీద దాడి చేయించడం, ఆ తర్వాత పుంగనూరులో 40 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాలే చివరకి ఒక పోలీసు సోదరుడి కన్ను పోయేలా శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం కానీ, అవినీతి, నేరాలు చేస్తే ఆ పైన ఆధారాలు అన్ని చూసిన పిమ్మట న్యాయస్థానాలన్నీ వీరికి అనుకూలంగా తీర్పు రాకపోయేసరికి.. చివరకి ఆ న్యాయమూర్తుల మీద ట్రోలింగ్ చేస్తారు. వారికి సంబంధించిన టీవీ ఛానెళ్లలో డిబెట్లు నడుపుతారు. తమను ఎవరూ కూడా ఏం చేయలేరన్న అహంకారంలో ఇవన్నీ చేస్తుంటారు. ఇటువంటివి అన్నీ యాంటీ సోషల్ ఎలిమెంట్స్ చేసే పనులే తప్ప.. ప్రజాస్వామ్యం మీద కానీ, రూల్ ఆఫ్ లా మీద కానీ నమ్మకం ఉన్నవారు చేసే పనులు కావు" అని సీఎం జగన్ పేర్కొన్నారు.
తమ స్వార్ధం కోసం ప్రజల జీవితాలతో ఆడుకుంటూ అన్‌రెస్ట్ క్రియటే చేసే ఇలాంటి దుర్మార్గుల విషయంలో ఎలాంటి మొహమాటం లేకుండా చట్టానికి పని పెట్టండని, ప్రజలకు మంచి చేసే విషయంలో ప్రజలకు రక్షణ కల్పించే పోలీసుల మీద దాడి చేసే ఇటువంటి దుష్టశక్తులకు మనం గుణపాఠం నేర్పకపోతే ఇక సమాజంలో ఎవరికి రక్షణ ఉంటుందన్నది కూడా మనమంతా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.
"ఇక మనందరి ప్రభుత్వం వచ్చాక పోలీసుల సంక్షేమం గురించి ఏ రకంగా అడుగులు వేశామన్నది నాలుగు మాటల్లో చెబుతాను.
దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 16వేల మంది మహిళా పోలీసులను ఈ నాలుగేళ్ల కాలంలో గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో మనందరి ప్రభుత్వం నియమించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా దిశ యాప్ తీసుకునివచ్చాం. దిశ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లాలో దిశ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించడం ఇలా అక్కచెల్లెమ్మల మీద వారి భద్రత మీద ఇంతగా ధ్యాస పెట్టిన పరిస్థితులు గతంలో ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా ఈ నాలుగేళ్లలో మనందరి ప్రభుత్వంలో మన పోలీసు సోదరులు చేస్తున్నారు" అని సీఎం జగన్ వివరించారు.

# ఘనంగా వైస్సార్సీపీ సీనియర్ నేత,మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు.

**-భారీ గజమాల,తో డ్రమ్స్ తో వెళ్లి సత్కరించిన అభిమానులు తరలివచ్చిన కార్యకర్తలు.**

**-కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించిన వైస్సార్సీపీ సీనియర్ నేత మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.**







ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 21:
నంద్యాల పట్టణం బొమ్మసత్రంలో వైస్సార్సీపీ సీనియర్ నేత,మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పుట్టినరోజు వేడుకులను వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఉదయం నుంచే మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నివాసం వద్ద సందడి ప్రారంభమైంది.అభిమానులు, మధ్య కేక్ కట్ చేశారు.అనంతరం మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అభిమానులు సురేష్, మోహన్ గౌడ్ ,భారీ గజమాల,తో , డ్రమ్స్ తో వెళ్లి సత్కరించి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ సందర్భంగా నంద్యాల పట్టణమంతా ఫ్లెక్సీలతో కార్యకర్తలు తమ అభిమానం చాటుకున్నారు.( ఈ కార్యక్రమంలో సురేష్ ,మోహన్ గౌడ్ ,ఉత్తేజ్ ,బ్రహ్మానందరెడ్డి , జమాల్ ,అమీర్ , అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలి..

## - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం టౌన్ అక్టోబర్ 21భీమవరం,
ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. పట్టణంలోని ఆరో వార్డులో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ముందుగానే వాలంటీర్ల ద్వారా, ఆశ వర్కర్ల ద్వారా ప్రతి కుటుంబంలో ఉన్నటువంటి సభ్యుల ఆరోగ్య భద్రతపై నివేదికలు తయారుచేసి ఈ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో వారికి ఉచితంగా రక్త పరీక్షలు చేయడంతో పాటుగా ఈసీజీ, ఇతర పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే మాదిరిగా అవసరమైన వారికి కార్పొరేట్ ఆసుపత్రిలో వైయస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం చేయడం జరుగుతుందన్నారు. కంటి పరీక్షలు కూడా చేసి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు, ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ కూడా చేయడం జరుగుతుంది అన్నారు. రాష్ట్రంలో ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైద్య పరంగా వేల కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నారని తెలిపారు. వైద్య పరంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, గాదిరాజు రామరాజు, చింతలపాటి నరసింహారాజు, కట్టా రవిశంకర్, కముజు చిన్న, కముజు శ్రీనివాస్, ములపల్లి స్వామి, కొత్తల కృష్ణ బాబు, వాసర్ల ప్రవీణ్, వాసంశెట్టి శ్రీనివాస్, అల్లూరి రాజేష్, గంటా సుందర్ కుమార్, చిగురుపాటి రాజు, కుప్పిలి వరం, చల్లబోయిన సూర్య ప్రకాష్, కంది గట్ల ఎడ్వర్డ్, గూడూరి రాధాకృష్ణ, కొట్టి కుటుంబరావు, కోమటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ శైవ క్షేత్రం శ్రీకాళహస్తిలో మార్కెట్ ప్రసాద్ .



ఆంధ్ర ప్రగతి శ్రీకాళహస్తి అక్టోబర్ 21:
దసరా శరన్నవరాత్రుల సందర్భంగా తిరుపతి జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రం శ్రీకాళహస్తి దేవస్థానం కు గత 16 సంవత్సరాల నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో టన్నుల కొద్ది కూరగాయలు వితరణ చేస్తున్న నంద్యాల మార్కెట్ ప్రసాద్ శనివారం నాడు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం సగర్వంగా స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శాలువతో మార్కెట్ ప్రసాద్ ను సన్మానించారు .

# ప్రతి ఒక్కరు రాజ్యాంగానికి లోబడి మాత్రమే మాట్లాడాలి..!



ఆంధ్ర ప్రగతి మంగళగిరి అక్టోబర్ 21: మీడియా సమావేశాలు, టీవీ చర్చల్లో పాల్గొనే జనసేన ప్రతినిధులు రాజ్యాంగ విలువలకు కట్టుబడి పాలనాపరమైన విధివిధానాలు, ప్రజోపయోగ అంశాల మీద మాత్రమే మాట్లాడాలని అధికార ప్రతినిధులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం పార్టీ అధికార ప్రతినిధులతో సుదీర్ఘంగా సమావేశం అయ్యారు. పార్టీ విధివిధానాలను స్పష్టంగా చెప్పారు. ఒక నాయకుడు ప్రభుత్వ పాలసీలకు ఆటంకం కలిగించినప్పుడు అతని విధానాలు, చేసిన తప్పుల గురించి బలంగా ప్రస్తావించాలని.. . కులాలు, మతాలు గురించి మాట్లాడవలసినప్పుడు రాజ్యాంగానికి లోబడి మాత్రమే మాట్లాడాలని అధికార ప్రతినిధులకు సూచించారు. అన్ని మతాలను ఒకేలా గౌరవించాలని, దేవాలయం లేదా చర్చి లేదా మసీదులపై దాడులు జరిగినప్పుడు ఒకేలా స్పందించాలి. ఒక మతం పట్ల ఉదాసీనంగా, ఒక మతం పట్ల నిర్లక్ష్యంగా, మరో మతాన్ని ఎక్కువగా చూడటం వంటి చర్యలకు పాల్పడే నాయకులను, పార్టీలను గట్టిగానే నిలదీయాలన్నారు. టీవీ చర్చలకు వెళ్లే వారు రాజకీయాలు, సమకాలీన అంశాలు, ప్రజా సమస్యలు మొదలగు ముఖ్యమైన అంశాలన్నింటిపైనా లోతుగా అధ్యయనం చేసి తగిన సమాచారం సిద్ధం చేసుకోవాలి. జనసేన ప్రతినిధుల వల్ల టీవీ చర్చలు ఉన్నత విలువలతో జరిగేలా చర్చను ముందుకు వెళ్ళేలా చూడండి. అనవసర విషయాలు, వ్యక్తిగత దూషణలు సమాజానికి హానిచేసే విధంగా చర్చలు ఉండకూడదు. టీవీల్లో జరిగే చర్చా కార్యక్రమాలు పిల్లలతో సహా కుటుంబ సభ్యులు చూసే అవకాశం ఉన్నందున సంస్కారవంతంగా అవి ఉండాలి. మాట్లాడేటప్పుడు ఎవరి మనోభావాలూ దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు. చర్చలో పాల్గొనే ఇతరులు మిమ్మల్ని రెచ్చగొట్టినా లేదా తూలనాడినా సంయమనం పాటించాలి. ఆ క్షణంలో మనం తగ్గినట్టు కనబడినా ప్రేక్షకులు, సమాజం దృష్టిలో పెరుగుతామనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సలహా ఇచ్చారు. చర్చల్లో వ్యక్తిగత విషయాలను గురించి మాట్లాడవద్దని అలాగే సోషల్ మీడియాకు అనవసరమైన ఇంటర్వ్యూలు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. వాటివల్ల కొన్నిసార్లు లేనిపోని అనుమానాలకు తావిచ్చే ప్రమాదం ఉంది. అదే విధంగా సోషల్ మీడియాలో వచ్చిన ఒక సమాచారాన్ని నిర్ధారించుకోకుండా మరొకరికో లేదా పార్టీ కార్యాలయానికి పంపడమో, దానిపై హడావిడి చేయడమో చేయవద్దన్నరు. పార్టీ ప్రతినిధిగా ఉంటూ సోషల్ మీడియాలో వ్యక్తిగత పోస్టులు పెట్టవద్దు. పార్టీ ప్రతినిధులు కేవలం పార్టీ కోసం మాత్రమే మాట్లాడాలి. మరెవరికో మద్దతుగా మాట్లాడవలసిన అవసరం లేదు. నా సినిమాలు, కుటుంబ సభ్యులపై వచ్చే విమర్శలపై కూడా స్పందించవద్దు. అలా స్పందించుకుంటూ వెళ్తే మన లక్ష్యం పక్కదారి పట్టే అవకాశం ఉందని స్పష్టం చేశారు. జీరో బడ్జెట్ రాజకీయాలు అనే అంశం మీద నేను అభిప్రాయాలు చెప్పలేదు. అదెలా పుట్టిందో తెలియదుగాని నేను జీరో బడ్జెట్ పాలిటిక్స్ చేస్తానని ప్రచారం చేశారు. నేను అన్నది ఓట్లను నోట్లతో కొనే వ్యవస్థను మార్చే విధానం గురించి. అంతేగానీ ఎన్నికల ప్రక్రియలో కార్యకర్తలకు మంచినీళ్ళు, టీ కూడా ఇవ్వకుండా పని చేయించుకోవడం గురించి కాదు. ఈ వ్యవస్థలో మార్పు ఇప్పటికప్పుడు సంభవిస్తుందని అనుకోవడం లేదు. రాజకీయాల్లో ఎప్పుడూ శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. మన పార్టీ కమ్యునిస్టులతో కలసినా, బీజేపీతో కలసినా, టీడీపీతో పొత్తు ఉన్నా అది రాష్ట్ర ప్రజలకు మేలు చేయడానికే విషయాన్ని చర్చల్లో అవసరం అయిన సందర్భాల్లో ప్రస్తావించాలి. ఇతర పార్టీలతో జత కట్టకుండా ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీలు ఉండవన్న విషయాన్ని మరచిపోవద్దన్నారు. అదే విధంగా ఏ రాజకీయ పార్టీకి, ఏ నాయకుడికీ నేను వ్యతిరేకం కాదు. వ్యక్తిగతంగా వారు నన్ను దూషించినా శత్రువుగా పరిగణించను. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఎవరిని ఎప్పుడు కలవాల్సి వస్తుందో కూడా మనం చెప్పలేం. ఒక్కోసారి మన ప్రత్యర్థి పార్టీ నాయకుల్ని కూడా కలవాల్సిన సందర్భాలు కూడా రావచ్చు. అందువల్ల చర్చల్లో పాల్గొనే వారు కూడా సుహృద్భావ వాతావరణంలో చర్చలు చేసి, చర్చలు ముగిశాక మంచిగా పలుకరించుకునే వాతావరణం ఉండాలని పవన్ సూచించారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ, పార్లమెంటులకు ఎన్నికల గడువు సమీపిస్తున్న తరుణంలో అధికార ప్రతినిధుల పాత్ర మరింత ఎక్కువగా ఉంటుంది. పార్టీ అభిప్రాయాలను బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సింది అధికార ప్రతినిధులే. ఈ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి వచ్చే నెలలో ఒక వర్క్ షాప్ ఏర్పాటు చేస్తామ”న్నారు. అధికార ప్రతినిధులకు సంబంధించిన వర్క్ షాప్ నిర్వహణకు శివశంకర్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశారు.



## ప్రజా దీవెనలతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం.



ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ అక్టోబర్ 21:

అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నంద్యాల మండలంలోని చబోలు గ్రామ సచివాలయ పరిధిలో 163 వరోజు శుక్రవారం పర్యటించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో గ్రామ సచివాలయ వ్యవస్థ దానికి అనుసంధానంగా వాలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చాయన్నారు. ఏ గడపను తొక్కినా ముఖ్యమంత్రి పట్ల వారి కృతజ్ఞతా భావం కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ఒక్క వైసిపి ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.ఈ ప్రభుత్వం పదికాలాలపాటు సుపరిపాలనతో సాగడం ఖాయమన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీవో సుగుణ శ్రీ , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి,సర్పంచ్ మౌనిక, ఎంపీటీసీ చెన్నయ్య, ఉపసర్పంచ్ హుస్సేన్ భాషా,నగనందరెడ్డి,రాజగోపాల్ రెడ్డి,మదర్ సా,తిమోతి, బాల ఉసేని, అహ్మద్ హుస్సేన్, విశాల్ రెడ్డి మధు గోపాల్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మహేష్, శివ నారాయణ ,మరియు వైసిపి కార్యకర్తలు సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

# గగన్ యాన్ ... మిషన్ టెస్ట్ లాంచ్ విజయవంతం.

అంతకుముందు.. ఇంజిన్ ఇగ్నిషన్ సరైన సమయానికి జరగకపోవడంతో టెస్ట్ లాంచ్ వాయిదా పడింది. కౌంట్ డౌన్‌కి 4 సెకండ్ల ముందు సాంకేతిక లోపాన్ని గుర్తించిన శాస్త్రవేత్తలు ప్రయోగాన్ని నిలిపివేశారు. ఆ తర్వాత లాంఛింగ్‌లో తలెత్తిన లోపాన్ని శాస్త్రవేత్తలు గుర్తించి సరిచేసినట్టు ఇస్రోట్విట్టర్ వేదికగా ప్రకటించింది.

గగన్‌యాన్‌లో భాగంగా క్రూ ఎస్కేప్ సిస్టమ్ టెస్ట్ డ్రైవ్ వాయిదాలు పడుతూ వచ్చింది. ఉదయం 8 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉంది. అయితే, మొదట సాంకేతిక కారణాల వలన 30 నిమిషాలు పాటు వాయిదా పడింది. తర్వాత మరోసారి 15 నిమిషాలు వాయిదా పడింది.

2025లో జరగనున్న గగన్ యాన్ ప్రయోగం కోసం సుమారు 20 టెస్ట్ డ్రైవ్ లు జరగనున్నాయి. ఇందులో క్రూ ఎస్కేప్ సిస్టమ్ టెస్ట్ డ్రైవ్ కీలకంగా ఇస్రో భావిస్తోంది. అంటే.. నింగిలోకి దూసుకెళ్లిన తర్వాత.. వ్యోమగాములు ప్రమాదంలో ఉంటే వారిని సేఫ్ గా కిందకు తీసుకొచ్చేందుకు ఈ టెస్ట్ డ్రైవ్ జరగనుంది. అయితే.. ఈ టెస్ట్ డ్రైవ్ మానవరహితంగా జరగనుంది.

అస్ట్రోనాట్స్ ప్రయాణించే క్రూ మాడ్యుల్, రాకెట్‌పై తొలి పరీక్షను ఇస్రో చేపట్టనుంది. ఈ ప్రయోగం కోసం ఇస్రో టీవీ-డీ1 అనే ప్రయోగాత్మక రాకెట్‌ను సిద్ధం చేసింది. దీని సాయంతో క్రూ మాడ్యుల్‌ను అంతరిక్షంలోకి పంపిస్తుంది. రాకెట్ కొంత ఎత్తుకు చేరుకున్నాక ఎస్కేప్ సిస్టమ్ క్రూ మాడ్యుల్‌ను రాకెట్ నుంచి వేరు చేస్తుంది. ఆ తర్వాత క్రూ మాడ్యుల్ తిరిగి బంగాళాఖాతంలో పడుతుంది.

ఆ తర్వాత ఇండియన్ నేవీ సాయంతో క్రూ మాడ్యుల్‌ను ఇస్రో తిరిగి స్వాధీనం చేసుకోనుంది. అందులోని డేటా ఆధారంగా రాకెట్, ఎస్కేప్ సిస్టమ్, క్రూ మాడ్యుల్ పనితీరును విశ్లేషించనున్నారు సైంటిస్టులు. అత్యవసర సందర్భాల్లో వినియోగించే ఎస్కేప్ సిస్టమ్ పనితీరును ఇస్రో ఈ ప్రయోగం ద్వారా పరీక్షిస్తోంది.

క్రూ మాడ్యూల్ ఎస్కేప్ సిస్టం సిస్టం భూమికి 17 కిలోమీటర్లు ఎత్తుకు తీసుకెళ్లి బిప్యారాచూట్ల సహాయంతో తిరిగి భూమికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయోగం సక్సెస్ అయితే భవిష్యత్తులో మానవ సహిత ప్రయోగాలు చేసేందుకు రూట్ క్లియర్ అయినట్టే అని ఇప్పటికే ఇస్రో ఛైర్మన్ ఇప్పటికే ప్రకటించారు. గగన్ యాన్ లో కీలకమైనది క్రూ మాడ్యూల్.. అస్ట్రోనాట్స్ అంతరిక్షంలోకో వెళ్ళేది, తిరిగి భూమిమీదకు వచ్చేది ఈ క్రూ మాడ్యూల్ నుంచే. కేరళ నుంచి క్రూ మాడ్యూల్ ను ఇప్పటికే శ్రీహరికోటకు తీసుకొచ్చిన ప్రయోగానికి రెడీ చేశారు.

## జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి



భీమవరం టౌన్ అక్టోబర్ 21

చంద్రబాబు అక్రమ అరెస్టుపై భీమవరం నియోజవర్గ తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాబుతో నేను కరపత్రాల పంపిణీ కార్యక్రమం భీమవరం పట్టణం 14వ వార్డులో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షతననిర్వహించారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ తెదేపాతో పొత్తు కుదిరిన జనసేనతో కలిసి జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నామని చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రజలంతా ఖండిస్తున్నారన్నారు.పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు మాట్లాడుతూ పట్టణములోని వ్యాపార వాణిజ్య సంస్థలతో పాటు ఇంటింటికి బాబుతో నేను కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని చంద్రబాబుకు మరింత సానుభూతి పెరిగిందని జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు గునుపూడి తిరుపాల్ ఎద్దు ఏసుపాదం మాదాసు కనకదుర్గ కోళ్ల నాగబాబు బొక్క సూరిబాబు జంపన ధనరాజ్ మాంతి గణపతి సయ్యద్ నసీమబేగం ఎండి షబీనా గంధం రాధా నేదునూరి గంగాధర్ తిలక్ నల్లం గంగాధర్ పడమట నరసింహమూర్తి దొంగ వెంకటేశ్వరరావు యలమంచిలి శ్రీనివాస్ బొక్క శ్రీనివాస్ భూపతిరాజు బుజ్జిరాజు గొంతిన శ్రీనివాస్ విజ్జూరోతు త్రిమూర్తులు గండి భూషణం బండి రాజేష్ గౌవర రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు ఇంకెన్నాళ్లీ జైలు..!

ఇక ఫైబర్ నెట్ స్కామ్ లో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా.. బాబు పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. కానీ టీడీపీ శ్రేణులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇక తాజాగా దీనిపై అత్యున్నత ధర్మాసనం ఇచ్చిన తీర్పు కూడా చంద్రబాబును ఉలిక్కి పడేలా చేసింది.ముందస్తు బెయిల్ పై విచారణను వచ్చే నెల 8న చేపడతామని చెబుతూ సుప్రీం కోర్టు వాయిదా వేసింది. దీంతో ఒక కేసు నుంచి బయటపడిన మరో కేసు చంద్రబాబు మెడకు గట్టిగా చుట్టుకునేలా కనిపిస్తుందనేది రాజకీయ అతివాదులు చెబుతున్నా మాట.

పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎన్నికల సమయానికి కూడా బాబు బయటకు రావడం కష్టమే అనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు బయటకు రాకపోతే అసలు టీడీపీ పరిస్థితి మరింత క్షీణించే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే పార్టీకి సంబంధించిన కార్యక్రమాలన్నీ హోల్డ్ లో పడిపోయాయి. ప్రస్తుతం బాబు అరెస్ట్ అంశాన్నే ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళుతు సానుభూతి పొందాలని టీడీపీ శ్రేణులు భావిస్తున్నారు. మొత్తానికి చంద్రబాబు బయటకు రాకపోతే పార్టీ అధోగతి పాలుకావడం ఖాయంగా కనిపిస్తోంది. చంద్రబాబుకు ఊరట దక్కడం లేదు. అవినీతి కేసుల్లో న్యాయస్థానాల్లో ఉపశమనం లభించడం లేదు. స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబు అరెస్ట్ అయ్యి 40 రోజులు దాటుతోంది.ప్రస్తుతం ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తనపై అక్రమంగా పెట్టిన కేసులను కొట్టివేయాలని కోరుతూ చంద్రబాబు ఏసీబీ కోర్టుతో పాటు పిటిషన్లు దాఖలు చేశారు. అక్కడ చుక్కెదురు కావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే తాజాగా ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. నవంబర్ 8 కి కేసు విచారణను వాయిదా వేస్తూ జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది ధర్మాసనం తీర్పు చెప్పింది.

ఫైబర్ నెట్ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 9న దానిపై విచారణ జరిగింది. కానీ హైకోర్టు బెయిల్ పిటిషన్ ను పరిగణలోకి తీసుకోలేదు. దీనిని సవాల్ చేస్తూ చంద్రబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇరు వర్గాల వాదనను విన్న సుప్రీం కోర్ట్ విచారణను నేటికి వాయిదా వేసింది. ఇక్కడ సానుకూలంగా తీర్పు వస్తుందని చంద్రబాబు తరుపు న్యాయవాదులు భావించారు. కానీ కోర్టు విచారణ వాయిదాకి మొగ్గు చూపింది. స్కిల్ డెవలప్మెంట్ కేసు పై ముందుగా తీర్పు వెల్లడిస్తామని.. ఆ తరువాత ఫైబర్ నెట్ కేసు అంశాన్ని పరిగణలో తీసుకుంటామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అంతవరకు చంద్రబాబును అరెస్టు చేయవద్దని.. పిటి వారెంట్ పై యధాతధ స్థితిని కొనసాగించాలని ఆదేశాలు ఇచ్చింది.

చంద్ర బాబు కేసులు ఇప్పట్లో తేలే అవకాశం కనిపించడం లేదు.ఈరోజు స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై విచారణ జరగనుంది. ఇప్పటికే ఈ కేసునకు సంబంధించి వాదనలు పూర్తయ్యాయి. తీర్పు రిజర్వ్ లో ఉంది. అయితే కోర్టు ఈరోజు తీర్పు చెబుతుందా? లేదా? అన్నది తెలియడం లేదు. ఇదో హై ప్రొఫైల్ కేసు కావడంతో లోతైన విచారణ జరగడంతో.. తీర్పు వెల్లడించే అంశంలో జాప్యం జరిగే పరిస్థితి ఉంది. ఈరోజు కానీ తీర్పు వెల్లడి కాకుంటే.. నవంబర్ మొదటి వారానికి కేసు విచారణ వాయిదా పడనుంది. ఇప్పటికే ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా పడింది. ముందుగా స్కిల్స్ స్కాం తీర్పు.. తరువాత ఫైబర్ నెట్ కేసులో బెయిల్ పై విచారణ చేపడతామని కోర్టు స్పష్టం చేయడంతో.. చంద్రబాబు మరికొన్ని రోజులు పాటు జైలులో ఉండాల్సిన అనివార్య పరిస్థితులు కనిపిస్తున్నాయి.